క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న యాచకులు, అభాగ్యులకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. మైదుకూరు రోడ్డు, శివాలయం వీధి, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న అభాగ్యులకు శుక్రవారం రాత్రి వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసులరెడ్డి, వెంకటసురేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సముచిత సత్కారం

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానం పునః నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చిన దాతలను శనివారం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు విశ్వనాధుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి యాదాల వెంకటసుబ్రమణ్యం సత్కరించారు. వంద సంవత్సరాల పురాతన ఆలయాన్ని పడగొట్టి రూ.3 కోట్లకు పైగా వెచ్చించి అద్భుతంగా నిర్మించారు. పునఃనిర్మాణానికి ఆర్యవైశ్యులు భూరి విరాళాలు అందజేశారు. వారికి దశరా ఉత్సవాల సందర్భంగా నూతన కమిటీ సన్మానం చేశారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక


త్యాగరాజరెడ్డి


సాయిప్రసాద్


వరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు ఐఎంఏ నూతన కార్యవర్గాన్ని జమ్మలమడుగు రోడ్డులోని ఐఎంఏ సభా భవనంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ త్యాగరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సాయిప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో ఐఎంఏ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. వైద్యుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రొద్దుటూరు ఐఎంఏ తరఫున ప్రొద్దుటూరు ప్రజలకు వివిధ రకాల వైద్య సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కొత్తగా ఎన్నికైన ఐఎంఏ కార్యవర్గానికి పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్: మండల పరిధి నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.

గోపవరంలో...

గోపవరం: మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అశ్వయుజ మాసం మొదటి శనివారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా స్వామివారు 18 రకాల కూరగాయలతో శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

ధ్యానంతో రుగ్మతలు దూరం

ప్రొద్దుటూరు కల్చరల్: ధ్యానంతో శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయని ధ్యాన శిక్షకుడు సత్యప్రవీణ్ తెలిపారు. స్థానిక మిట్టమడి వీధిలోని హార్ట్ ఫుల్‌నెస్ నిలయంలో శనివారం రామిక్రిష్ణ మిషన్ ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్ నెస్ ధ్యానోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

వైఎస్సార్ కడప జిల్లాగా మార్చాలి

ప్రొద్దుటూరు క్రైం: వైఎస్సార్ జిల్లా పేరును 'వైఎస్సార్ కడప జిల్లా'గా మార్చాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం బొల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వానికి పంపించనున్న వినతి పత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మన జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చాలని కోరుతూ సీఎం చంద్రబాబునాయుడుకు వినతి పత్రాలను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించనున్నట్లు తెలిపారు. కడప అనే పదానికి వేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి సభ్యులు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శంకర్‌రెడ్డి, డాక్టర్ బ్రహ్మేశ్వర్‌కుమార్, డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి, నందీశ్వరరెడ్డి, మోగానందరెడ్డి, విజయభాస్కర్, సర్వేష్, కవి జింకా సుబ్రమణ్యం, ఎన్జీఓస్ సెక్రటరీ రామసుబ్బయ్య, వేదవ్యాస డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ సుదర్శన్‌రెడ్డి, లేపాక్షి డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ వీరరాఘవరెడ్డి, మెడికల్ రెప్స్ అసోసియేషన్ నాయకులు నరసింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.


లోకపావని.. జగజ్జననీ


ప్రొద్దుటూరు కల్చరల్ : రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో..


మైదుకూరు: అమ్మవారిశాలలో పార్వతిదేవి


బ్రహ్మంగారిమఠం : గాయత్రీదేవిగా శ్రీ ఈశ్వరీదేవి


పోరుమామిళ్లలో అన్నపూర్ణాదేవి అలంకారం


ప్రొద్దుటూరు కల్చరల్: చౌడేశ్వరి దేవి ఆలయంలో అన్నపూర్ణాదేవి


బద్వేలులోని అమ్మవారిశాలలో అష్టలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు


ఖాజీపేట : ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రెడ్యం కుటుంబ సభ్యులు

సాక్షి, నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు అయిన శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. 'లోకపావని.. జగజ్జననీ దీవించు తల్లీ' అంటూ భక్తులు వేడుకున్నారు. మైదుకూరు అమ్మవారిశాలలో పార్వతిదేవిగా, భీమేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఖాజీపేటలోని అమ్మవారిశాలలో రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఏపీఎస్ ఆర్టీసీ మాజీ రీజనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు గంగిశెట్టి వారిని ఘనంగా సత్కరించారు. బద్వేలులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు అష్టలక్ష్మీదేవిగా, మహాలక్ష్మి ఆలయంలో గజలక్ష్మీదేవిగా, వీరభద్రస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, కోదండరామాలయంలో శ్రీకృష్ణావతారంలో స్వామివారు దర్శనమిచ్చారు. పోరుమామిళ్లలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి గురువాయూరప్పగా, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో వాసవీమాత శ్రీలన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. కాశినాయన మండలంలోని నరసాపురంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కలసపాడులోని వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో ధనలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కాశినాయన: అన్నపూర్ణా దేవి అలంకారం


కలసపాడులో ధనలక్ష్మి దేవి అలంకారం

ఉన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి


సన్మాన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు కల్చరల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని యోగివేమన యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో అవార్డీ టీచర్స్ అసోసియేషన్, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా గురువులను గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ 2015 నుంచి అవార్డీ టీచర్స్ అసోసియేషన్, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 50 మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు శాలువా కప్పి, జ్ఞాపికలతో సత్కరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గానుగపెంట హనుమంతరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రమ్మ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చంద్రశేఖర్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, అవార్డీ టీచర్స్ అసోసియేషన్ అదనపు కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, ఎస్‌వీడీసీ కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ, ఆటా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ 'బండి'కి నివాళి


విజయభాస్కర్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బండి విజయభాస్కర్‌రెడ్డి (64) శనివారం వేకువజామున గుండెపోటుతో మరణించారు. మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన ఆయన 40 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. గతంలో సర్పంచ్‌గా, రెండుమార్లు ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. మండలంలో సుదీర్ఘకాలం పాటు టీడీపీలో ఉన్న ఈయన గడిచిన ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈయన మరణ వార్త తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు.. మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. విజయభాస్కర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసిన అనంతరం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ బండి విజయభాస్కర్‌రెడ్డి అకాల మరణం తనను ఎంతో కలిచివేసిందని తెలిపారు. తనకు బండి చిరకాల మిత్రుడు అని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆయన మరణాన్ని తాను జీర్ణించుకోలేకపోతున్నానని, ఆయన కుటుంబానికి దేవుడు అండగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


బండి విజయభాస్కర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ఆహారంలో పోషక విలువలు ఉండాలి


పోషణ్ మహా కార్యక్రమంలో పాల్గొన్న కేవీకే శాస్త్రవేత్తలు, ఐసీడీఎస్ అధికారులు

మైదుకూరు: మహిళలు, కిశోర బాలికలు తీసుకునే ఆహారంలో పోషక విలువలు ఉండాలని, వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. శనివారం ప్రధాన మంత్రి మోదీ కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల చేసిన సందర్భంగా కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికలకు సమతుల ఆహారాన్ని అందించాలన్నారు. మైదుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని కేవలం లబ్ధిదారులు మాత్రమే వినియోగించుకోవాలని, ఆ విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ రైతులకు మామిడి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, బాలనరసింహారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఓబుళమ్మ, వరలక్ష్మి, ప్రశాంతి, క్లస్టర్ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బద్వేలు అర్బన్: 2024–26 నూతన మద్యం పాలసీలో భాగంగా బద్వేలు ఎక్సైజ్ సర్కిల్ పరిధికి మంజూరైన 15 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.సీతారామిరెడ్డి తెలిపారు. శనివారం ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీలో 6 మద్యం దుకాణాలు, బద్వేలు రూరల్ 1, గోపవరం 1, బి.కోడూరు 1, కలసపాడు 2, పోరుమామిళ్ల 4 మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒక దరఖాస్తుదారుడు ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 9 సాయంత్రంలోపు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

మైదుకూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో...

మైదుకూరు: మైదుకూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న 16 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ధీరజ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–26 ఎక్సైజ్ పాలసీలో భాగంగా, మైదుకూరు ఎక్సైజ్ సర్కిల్‌లో 16 మద్యం దుకాణాలు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీలో 6 షాపులు, మైదుకూరు మండలంలో 3 షాపులు, దువ్వూరు మండలంలో 4 షాపులు, బ్రహ్మంగారిమఠం మండలంలో 2 షాపులు, కాశీనాయన మండలంలో ఒక షాపునకు టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. వీటిని ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ఆప్లై చేసుకోవాలన్నారు. ఈ పాలసీలో ఒక దరఖాస్తుదారుడు ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 11వ తేదీ కలెక్టర్ ఆధ్వర్యంలో డిప్ ద్వారా తీస్తారని తెలిపారు.

ప్రొద్దుటూరు ఎక్సైజ్ సర్కిల్‌లో...

ప్రొద్దుటూరు క్రైం: 2024–26 పాలసీలో భాగంగా ప్రొద్దుటూరు ఎక్సైజ్ సర్కిల్‌లో ఉన్న 19 మద్యం షాపులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 14 షాపులు, రూరల్ మండలంలో రెండు, చాపాడు మండలంలో రెండు, రాజుపాళెం మండలంలో ఒక మద్యం షాపు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 9న సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 11వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో డిప్ సిస్టం ద్వారా మద్యం షాపుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరు అందిస్తున్నాం


రాజోలి ఆనకట్ట వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న డీఈ పుల్లయ్య

రాజుపాళెం: రాజోలి ఆనకట్ట నుంచి కేసీ చాపాడు, కేసీ ప్రధాన, కుందూనది ద్వారా రైతులకు చివరి ఆయకట్టు వరకు నీటిని అందిస్తున్నామని కేసీ కెనాల్ డీఈ పుల్లయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని రాజోలి ఆనకట్టను ఆయన శనివారం కేసీ కెనాల్ ఏఈ జమాల్ వల్లితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 9100 క్యూసెక్కుల నీరు పోతోందన్నారు. దువ్వూరు వద్ద కేసీ ప్రధాన కాలువలో పిల్లవాడు గల్లంతు కావడంతో ఆ కాలువలో నీటిని తగ్గించామని, పిల్లవాడు కనిపించిన తర్వాత యథావిధిగా నీటిని వదులుతామని తెలిపారు. అక్కడక్కడా మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరి, లస్కర్ ఆదాం వలి పాల్గొన్నారు.

పీఆర్‌సీ, ఐఆర్ ప్రకటించాలి


మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

పోరుమామిళ్ల: రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా పీఆర్‌సీ, ఐఆర్ వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రీజనల్ కన్వీనర్ సత్తార్, జిల్లా నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి కోరారు. శనివారం పోరుమామిళ్ల ఏపీటీఎఫ్ రీజనల్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో రీజనల్ కన్వీనర్‌గా సత్తార్, కో కన్వీనర్‌గా సుబ్బయ్య, ట్రెజరర్‌గా నరసింహారెడ్డిలను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

బలహీనవర్గాలపై అధికార పార్టీ నాయకుల ఆగడాలు

- రాత్రికి రాత్రి కంచెను తొలగించిన వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు


కంచెను తొలగించిన టీడీపీ నాయకులు

బి.కోడూరు: మండలంలోని పెద్దుళ్ళపల్లె గ్రామానికి చెందిన యాసాని వెంకటసుబ్బయ్య చెందిన సర్వేనెంబర్ 281లోని 2.06 సెంట్ల భూమికి సంబంధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వివాదం లేవనెత్తారు. అందుకు సంబంధించి ఆర్డీఓకు, జిల్లా సర్వోన్నతాధికారికి తమ గోడును విన్నవించుకోగా ఆ పొలానికి సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించిన తర్వాత ఆ పొలం నాగరాజుకు చెందినదే అని గుర్తించిన అధికారులు ప్రస్తుత మండల తహసీల్దారు ఎన్‌డార్స్‌మెంట్ కూడా ఇచ్చారు. అందుకు సంబంధించి ఆ పొలాన్ని అదే గ్రామానికి చెందిన సాదరిసుబ్బారెడ్డి అనే టీడీపీ నాయకుడు గత కొంత కాలంగా ఆ భూమిని ఆక్రమించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దుళ్ళపల్లె గ్రామపొలం సర్వే నెంబర్ 281లో 1994లో అప్పటి ప్రభుత్వం యాసాని వెంకటసుబ్బయ్య పేర 2.06 ఎకరాలు భూమిని పట్టా ఇచ్చింది. అప్పటి నుండి వెంకటసుబ్బయ్య సాగు చేసుకుంటూ ఉండేవాడు. కొంత కాలంగా సాదరి సుబ్బారెడ్డి తన పొలం పక్కనే ఉండటంతో పొలాన్ని ఆక్రమించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశారు. సుబ్బారెడ్డి ఆక్రమించిన తన భూమిని తనకు ఇప్పించాలని వెంకటసుబ్బయ్య గతంలో ఆర్డీఓ, కలెక్టర్ వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది. దీనిపై స్పందించిన అధికారులు విచారణ జరిపి రికార్డులను పరిశీలించి ఆక్రమణకు గురైన భూమి వెంకటసుబ్బయ్యకు చెందినదిగా నిర్ధారించి అతనికి ఎన్‌డార్స్‌మెంట్ కూడా ఇచ్చి పోలీసుల సమక్షంలో భూమిని అప్పగించారు. దీంతో వెంకటసుబ్బయ్య ఆ భూమిలో కంచె వేసుకుని పొలాన్ని సాగు చేసుకునేందుకు సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన సుబ్బారెడ్డి మరికొంత మంది నాయకులు శుక్రవారం భూమిని ఆక్రమించేందుకు పొలానికి ఏర్పాటు చేసిన కంచెను దౌర్జన్యంగా తొలగించారు. ఈ విషయమై బాధితుడు వెంకటసుబ్బయ్య కలెక్టర్, తహసీల్దారు ఇచ్చిన ఆదేశాలకు విలువ లేకుండా అధికారపార్టీ నాయకులు దౌర్జన్యం చేస్తుండటంతో తమగోడు ఎవరికి చెప్పుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు చొరవ చూపి భూ సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

అట్లూరు ఎంపీడీఓగా భాస్కర్‌బాబు



అట్లూరు: అట్లూరు ఎంపీడీఓగా శనివారం భాస్కర్ బాబు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సుజాతమ్మ బదిలీపై వెళ్లారు.

రాజుపాళెం ఎంపీడీఓగా వెంకట రమణారెడ్డి



రాజుపాళెం: రాజుపాళెం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా ఏవీ రమణారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. వీరపునాయునిపల్లె ఎంపీడీఓగా పని చేస్తున్న వెంకటరమణారెడ్డి ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రాజుపాళెంకు వచ్చారు. ఇప్పటి వరకు ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్ ఎఫ్ఏసీ(ఎంపీడీఓ)గా ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమణారెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.



సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



కలియుగ అవతార పురుషుడైన వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు రోజూ లక్షలాది మంది వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయింది. వంద రోజుల్లో చేసింది చెప్పుకోలేక.. ఆధారాలు లేకుండానే తిరుమల లడ్డూను వివాదాస్పదం చేశారు. సిట్ విచారణ రాష్ట్ర ప్రభుత్వానికే అనుకూలంగా ఉంటుంది. సుప్రీంకోర్టు తీర్పుతోనే న్యాయం జరుగుతుంది.

– చిప్పగిరి ప్రసాద్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, ప్రొద్దుటూరు

వాస్తవాలు వెలుగులోకి వస్తాయి



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పరిపాలన వైఫల్యాలు బయటపడుతాయని భావించి.. లడ్డూ గురించి విమర్శలు చేశారు. తిరుమల లడ్డూ తయారీకి సంబంధించి నెయ్యి కల్తీపై కలియుగ దేవుడైన వెంకటేశ్వరుడు వాస్తవాలను వెలుగులోకి తెస్తారన్న నమ్మకం ఉంది.

– టి. మారుతిప్రసాద్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, ప్రొద్దుటూరు

చంద్రబాబుకు చెంపపెట్టు



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారంటూ చంద్రబాబు చేసిన దుష్ప్రచారం నేపథ్యంలో తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఆయనకు చెంపపెట్టు లాంటివి. సీఎం స్థాయిలోని వ్యక్తి నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదు. స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు ద్వారా వాస్తవాలు బహిర్గతమవుతాయి.

– జి.రమేష్‌బాబు, జి.ఎస్.గోల్డ్‌ప్యాలెస్ అధినేత, బద్వేలు

సనాతన ధర్మాన్ని వక్రీకరిస్తున్నారు



సనాతన ధర్మంపై కనీస అవగాహన లేని రాజకీయ నాయకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారు. కేవల ఉద్దేశ పూర్వకంగానే తిరుమల లడ్డులో కల్తీ జరిగిందని దుష్ప్రచారం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుతో అందరూ ఒక్కసారిగా యూటర్న్ తీసుకుంటున్నారు. వాస్తవాలన్నీ ప్రజలకు తెలిసిపోయాయి. రాజకీయాల కోసం దేవున్ని వాడుకోవడం చాలా పెద్ద నేరం.

– పోరెడ్డి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, ప్రొద్దుటూరు

తన గోతిలో తానే పడ్డాడు



తిరుమల లడ్డు కల్తీ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తాను తీసిన గోతిలో తానే పడ్డాడు. కనీస ఆధారాలు లేకుండా దేవుడి ప్రసాదంలో కల్తీ జరిగిందని విమర్శలు చేస్తే ఎలా? తిరుమల పవిత్రత గురించి దేశ వ్యాప్తంగా అందరికీ తెలుసు. చంద్రబాబు చేసిన విమర్శలు భక్తుల మనోభావాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి.

– మార్తల ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు మండల కన్వీనర్